ప్రజాశక్తి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-పాడేరు: ఉమా నీలకంటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహెూత్సవాలు పురస్కరిం చుకొని ఈనెల 16,17,18 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ ఎంతో ఉత్సాహంగా సాగాయి. వీటిని పలువురు క్రీడాకారులు వీక్షించేందుకు తరలి వచ్చారు. ఈ ప్రథమ స్థానంలో విజేత వంజరి అప్పలనాయుడు, శివశంకర్ విజేతలుగా నిలిచారు. వీరికి రూ.10,116ల నగదు బహుమతి, స్వామివారి చిత్రపటాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పి.శ్రీనివాసరావు సోమవారం ఆలయం వద్ద అందజేశారు. ద్వితీయబహుమతి కింద కిల్లో భీమరాజ్, పలసీ కిరణ్ లకు రూ. రూ.8000, స్వామివారి చిత్రపటం ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు, రమేష్ నాయుడు, ప్రధాన కార్యదర్శులు ఉప్పలవెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాసరావు, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కె.మోహన్, రాంబాబు, సురేష్, ప్రశాంత్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు మూసివేస్తే ఊరుకోం

- విద్యా హక్కు చట్టానికి ప్రభుత్వం తూట్లు - గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా-

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కుమిడిపుట్టు గ్రామ ఎంపిపి ప్రాథమిక పాఠశాలతో పాటు 11 ప్రాథమిక పాఠశాలలను మూసివేతను తీవ్రంగా ఖండిస్తున్నామని గిరిజన సంఘం నేతలు తెలిపారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను ఆధ్వర్యాన గుమ్మిడిపుట్టు గ్రామ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో మండల వైస్ ఎంపిపి 1 పాటుబోయి సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల వద్ద ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపిపి 1 సత్యనారాయణ, సర్పంచ్ త్రినాధ్‌లు మాట్లాడుతూ, విద్యార్థులు తక్కువగా ఉన్నారని మండలంలో 11 పాఠశాలలు ఎత్తేసే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులు ఎంతమంది ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతంలో విద్యాభ్యాసాన్ని అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో విద్య హక్కు చట్టం అమలు కాలేదన్నారు. గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేయడం సరికాదన్నారు. మండలంలో డ్రాప్ ఔట్స్ విద్యార్థులు ఇప్పటికే అధిక సంఖ్యలో పెరుగుతుంతే రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అస్తవ్యస్తం చేయడం తగదన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న పాఠశాలలను మూసివేయడమే కాకుండా, ఉపాధ్యాయ పోస్టులను కుదించి వేయడంతో పేద నిరుపేద విద్యార్థులకు విద్య అందకుండా చేస్తుందన్నారు. పాఠశాలలు మూతపడితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, పాంగి భీమరాజులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ప్రత్యేకంగా డీఎస్సీల నియామకాలు చేపట్టి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి సంవత్సరం డిఎస్సి విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్రెల ఉప్ప సర్పంచ్ గణపతి, నారాయణ, లైకొన్, డోంబ్రు, విద్యార్థుల తల్లి దండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేపడుతున్న గిరిజన సంఘం నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు

మావోయిస్టు పార్టీ సభ్యుడు అరెస్టు

ప్రజాశక్తి- చింతూరు

మావోయిస్టు పార్టీ సభ్యుడు గాలి నారాయణరెడ్డి అలియాస్ రాజ్ కుమార్‌ను చింతూరు పోలీసు స్టేషన్ పరిధి లంకపల్లి శివారు గ్రామం అటవీ ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చింతూరు సిఐ అప్పల నాయుడు సోమవారం తెలిపారు. సిఐ కథనం ప్రకారం... గారి నారాయణరెడ్డి 2020 సంవత్సరంలో ఒక వ్యక్తితో పరిచయమై మావోయిస్టు పార్టీలో చేరాడు. అనంతరం ఆయన చింతూరు సబ్ డివిజన్‌లోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ అనేక నేరాలకు పాల్పడినట్లు పలు కేసులు ఉన్నాయి. 2021 నవంబర్ నెలలో ఎటపాక మండలం బండిరేవు గ్రామంలో మడివి రాజ్ కుమార్ అనే వ్యక్తిని హత్య చేశారు. అక్టోబర్ నెలలో చింతూరు మండలం మల్లంపేట గ్రామ శివారులో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీస్ పార్టీని హతమార్చడానికి అడవిలో బూబీ ట్రాప్స్ ఏర్పాటు చేసిన దాంట్లో ప్రధాన ముద్దాయి. 2022 ఏప్రిల్ 24న చింతూరు మండలం సర్వేల గ్రామంలో జాతీయ రహదారిపై కెవిఆర్ ట్రావెల్స్ బస్సులు దగ్ధం చేసిన ఘటనలో నారాయణరెడ్డి హస్తం ఉంది. ప్రజా కోర్టు నిర్వహించి నలుగురు వ్యక్తులను మల్లంపేట అటవీ ప్రాంతంలో తీసుకువెళ్లి హత్య చేసిన ఘటనలో కూడా ఆయన ఉన్నాడు. 2023 జనవరి మొదటి వారంలో చింతూరు మండలం దొరకన్నకోట గ్రామంలో ఇన్‌ఫార్మర్ నెపంతో సోయం సుబ్బయ్య అనే వ్యక్తిని హత్య చేసిన దాంట్లో ఉన్నాడు. పట్టుబడిన మావోయిస్టు నారాయణరెడ్డి నుండి ఒక ప్రెషర్ కుక్కర్, డిటోనేటర్లు, కరెంట్ వైర్లు, ఇనుప ముక్కలు తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ అప్పలనాయుడు తెలిపారు.


మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాస్

ఆర్ఎఆర్ఎస్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం ఉదయం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వ్యవసాయ పరిశోధన స్థానంలో పని చేస్తున్న 21 మంది కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా సిఐటియు అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనులను బహిష్కరించి నిరవధిక సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16 17 తేదీలలో నిరసనలు చేపట్టామని, గత్యంతరం లేని పరిస్థితుల్లోనే వ్యవసాయ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లడం జరిగిందన్నారు. వ్యవసాయ కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వీరికి ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు థర్డ్ పార్టీ ద్వారా ఇస్తుండడంతో వేతనాల్లో కోతపడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మికులకు మధ్యవర్తిత్వంగా ఉన్న కాంట్రాక్టర్‌ని రద్దు చేసి నేరుగా ఆచార్య రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి జీతాలు వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు పే స్కేలు అమలు చేయాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం త్వరితగతిన సమస్య పరిష్కారం చేయడానికి ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వరి, అర్జున్, నర్సింగరావు పాల్గొన్నారు.




సమ్మెలో పాల్గొన్న సిఐటియు నేత చిన్నయ్యపడాల్, ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికులు

రవిబాబుకు ఎమ్మెల్సీ పదవి

ప్రజాశక్తి-పాడేరు: ఎస్టి కమిషన్ చైర్మెన్ కుంభ రవి బాబును గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రవిబాబు విజయవాడలో సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మెన్ శతక బుల్లి బాబు అంబేద్కర్ జంక్షన్ వద్ద చిరు వ్యాపారస్తులకు, స్థానిక ప్రజలకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి ఏజెన్సీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్, నేత మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబును ఎమ్మెల్సీగా నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో, పాడేరు మాజీ మండల అధ్యక్షులు కూడా సింహాచలం, పాడేరు మాజీ ఎంపిపి రమణమూర్తి, కాడేలు ఎంపీటీసీ లకే రామకృష్ణ పాత్రుడు, ఎంపీటీసీ ముదిలి సత్యనారాయణ, కాడెలి సర్పంచ్ లక్ష్మీమోజా, పాడేరు ఎంపీటీసీ పాలసీ బాబురావు, సర్పంచ్‌లు లంకెల చిట్టమ్మ, రవి కుమార్, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కిరసాని బొజ్జన్న, సింహాద్రి, రాజారావు పాల్గొన్నారు.

వైసిపి నేతల సంబరాలు

డుంబ్రిగూడ: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుకు గవర్నర్ కోట నుంచి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంపై స్థానిక వైసిపి నాయకులు హర్షం చేశారు. టికెట్ ఇవ్వడంతో వైసిపి నాయకులు మండల కేంద్రంలో టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హెచ్‌బి రామానాయుడు, ఎంపిటిసి రామదాసు, బికే నాయుడు, పరశురాం, నిర్మల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సిఎం జగన్‌ను కలిసిన రవిబాబు

తెల్లరేషన్ కార్డుదారులకు సకాలంలో సరుకులు

- వచ్చే నెల నుంచి చోడి పిండి సరఫరా

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతినెల నిత్యవసర సరుకులు సకాలంలో సరఫరా చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన జిసిసి అధికారులు, సేల్స్‌మెన్లు, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, సివిల్ సప్లై డీలర్లు, ఎండియు వాహనాల ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి శివ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుండి 17వ తేదీ మధ్య నిత్యావసర వస్తువులను ఎండియు వాహనాల ద్వారా సరఫరా చేయాలన్నారు. ప్రతినెలా సరుకులను మండల స్టాక్ పాయింట్‌కు ఎప్పటికప్పుడు చేరవేసి ఆయా సివిల్ సప్లై డిపోల ద్వారా లబ్ధిదారునికి బియ్యం, కందిపప్పు, పంచదార సరఫరా చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన రిక్వైర్మెంట్లు ఎప్పటికప్పుడు ఇండెంట్లు సమర్పిస్తే ఆ ప్రకారం సరుకులు చేరవేయడం జరుగుతుందని చెప్పారు. ఏజెన్సీలోని ప్రతి సివిల్ సప్లై డిపోలలో వచ్చే నెల నుండి చోడి పిండి సరఫరాకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఏజెన్సీలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వారానికి మూడు రోజుల పాటు రాగి జావాతో పాటు 10 గ్రాముల బెల్లం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సివిల్ సప్లై షాపులలో డివైజర్ లేని వారికి వాటిని సరఫరా చేస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డుదారునికి సరఫరా చేసే సరుకులు ఫొటో, వీడియో తీసి గ్రూపో్ల పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి శివప్రసాద్, సివిల్ సప్లై డిఎం గణేష్ కుమార్, ఏఎంవో సి.శ్రీహరి, సిడిపిఓ సంజ్య రాణి, లక్ష్మి, ఎస్ఎంఎంఎన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి ఉమా రాణి

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 15వ తేదీ నుండి ఏప్రిల్ నాలుగు వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసామని ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి పి.ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు పాడేరు డివిజన్‌లో 15, రంపచోడవరం డివిజన్ లో 10 కలిపి 25 కేంద్రాలు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు పాడేరు డివిజన్ లో 16, రంపచోడవరం డివిజన్ లో 18 కలిపి 34 కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. ఒకేషనల్ పరీక్షలకు పాడేరు డివిజన్‌లో 15, రంపచోడవరం డివిజన్‌లో 02 కలిపి 17 కేంద్రాలు ఎంపిక చేశామని ఆమె వివరించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సాధారణ, ఒకేషనల్ కలిపి 6,534 మంది విద్యార్థులు (అందులో సాధారణ పరీక్షలకు 5,385 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,149 మంది విద్యార్థులు), రెండవ సంవత్సరం సాధారణ, ఒకేషనల్ కలిపి 5,654 మంది విద్యార్థులు (అందులో సాధారణ పరీక్షలకు 4,897 మంది, ఒకేషనల్ పరీక్షలకు 757 మంది విద్యార్థులు) హాజరు కానున్నట్లు తెలిపారు. బోటనీ, జువాలజీ ప్రాక్టికల్ పరీక్షలకు 1,556 మంది చొప్పున ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్ పరీక్షలకు 2,795 మంది చొప్పున, కలిపి 8,702 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆమె వివరించారు.

వైద్యశిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ అరగడాపల్లి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు వైద్యులు శశికాంత్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరుగురు జ్వర పీడితులకు సాదారణ జ్వరంగా నిర్ధారణ అయ్యింది. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాష్, శోభన్ బాబు, కృష్ణ కుమారి, మంగమ్మ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పివిటిజి ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: పివిటిజి ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, తహశీల్దారులతో సోమవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫారం 6బి సేకరణ, భూముల రీసర్వే, ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ, మ్యుటేషన్ల తిరస్కరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన పివిటిజిలందరనీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఫారం 6బి పత్రాలు సేకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫారం 6బి సేకరణలో పాడేరు, ముంచింగ్‌పుట్టు, జి.కె.వీధి చింతపల్లి, వై.రామవరం, చింతూరు మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. రానున్న పదిహేను రోజుల్లో పురోగతి సాధించాలని స్పష్టం చేసారు. ఎంఎల్‌సి ఓటర్లలో నకిలీ ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టా ల న్నారు. రీ సర్వే సక్రమంగా జరగాలన్నారు. 385 గ్రామాల్లో భూములు రీ సర్వే పూర్తి చేయాలని సూచించారు. మ్యుటేషన్లు ప్రక్రియ పక్కాగా చేయాలన్నారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఉద్యోగులందరూ తప్పని సరిగా ముఖ హాజరు వేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పీఓ రోణంకి గోపాల క్రిష్ణ, రంపచోడవం ఐటిడిఏ పీఓ సూరజ్ ధనుంజయ్ గనోరే, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డి ఆర్‌ఓ అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై నిరసన

- ★ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన గిరిజన సంఘం నేతలు
- ★ బాధ్యులను సస్పెండ్ చేయాలని, ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్


ఐటిడిఎ పిఒను ప్రశ్నిస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు తదితరులు

ప్రజాశక్తి - రంపచోడవరం

దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ బాలికల పాఠశాలలో వారం వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినుల మరణంపై తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నేతలు తీవ్రంగా నిరసించారు. గిరిజన సంఘం, ఎవిఎస్‌పి సంఘాల ఆధ్వర్యాన విద్యార్థినుల తల్లిదండ్రులు సోమవారం ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. 'గిరిజనులు, గిరిజన విద్యార్థులు చనిపోతే పట్టించుకోరా?' 'విద్యార్థుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా? సిగ్గు.. సిగ్గు..' 'విద్యార్థుల మరణాలను అరికట్టాలి', 'చనిపోయిన విద్యార్థినుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి', 'ముసినిగుంట పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లను సస్పెండ్ చేయాలి', ఐటిడిఎ పిఒ, డిడిలను బర్తరఫ్ చేయాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మరణాలపై ఐటిడిఎ పిఒ వచ్చి సమాధానం చెప్పాలని తల్లి తండ్రులు పట్టుబట్టడంతో పిఒ గ్రీవెన్స్ నుండి ధర్నా వద్దకొచ్చి సమస్యలను విన్నారు. పిఒకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. విద్యార్థులు చనిపోతే ఐటిడిఎ అధికారులు ఏమి చేస్తున్నారని, 2 పాయింట్లు బ్లడ్‌తో చనిపోవాల్సిన పరిస్థితి ఆడపిల్లలకు ఎందుకు వచ్చిందని గిరిజన సంఘం నేతలు ప్రశ్నించారు. పిఒ స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ పిల్లలను హాస్టల్‌కు పంపేది లేదని తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ మృతుల్లో రెండో అమ్మాయి ఎయిడ్స్ వచ్చి చనిపోయిందని అధికారులు అంటే, ఎయిడ్స్ వచ్చి చనిపోతే అధికారులు ఏమి చేస్తారని పిఒ మాట్లాడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పాఠశాల, ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. వాస్తవాలను పక్కన పెట్టి, గిరిజన విద్యార్థుల మరణాలు గురించి పట్టకుండా, వారి ప్రాణాలకు విలువ లేకుండా లెక్క లేనితనాన్ని ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. దీనికి స్పందించిన పిఒ విద్యార్థినుల మరణాలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దీనికి ముందు ధర్నాలో లోతా రామారావు మాట్లాడుతూ వారం వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడంతో ఆ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన, భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తక్షణమే హెల్త్ ఎమెర్జెన్సీ ప్రకటించి, నిధులు కేటాయించాలని, అన్ని ఆశ్రమ పాఠశాలలకు ఎఎన్ఎంలను నియమించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముసినిగుంట పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లు, పైస్థాయి ఐటిడిఎ అధికారులను సస్పెండ్ చేయాలని, ఆశ్రమ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయాలని, ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్త హీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్ రెడ్డి, కంభం శాంతి రాజు, బట్ట మల్లిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చావలం రాంబాబు, గొల్లె రవికుమార్ రెడ్డి, పూసం బాలు దొర, బోరుగ గంగరాజు, కుర్సం వరలక్ష్మి, బోరగా ఎర్రమ్మ, పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఉండగా

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-మోతుగూడెం, చింతూరు


ఎంటిఎస్.రస్కిన్ (ఫైల్‌ఫొటో)

చింతూరు మండలంలోని మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రం బోధిస్తున్న ఎంటిఎస్.రస్కిన్ (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. రస్కిన్ ఎప్పటిలాగే సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి విధుల్లో ఉండగా కూర్చున్న కుర్చీ నుండి కిందకు జారి పడిపోయారు. దీంతో తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. రస్కిన్ స్వగ్రామం రంపచోడవరం. దీంతో ఆయన భౌతికయాన్ని రంపచోడవరం తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రస్కిన్ మృతితో ఇటు మోతుగూడెం, అటు రంపచోడవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రస్కిన్ గతంలో చింతూరు మండల విద్యాశాఖాధికారిగా కొంతకాలం పనిచేశారు. ఉద్యోగం తొలినాళ్లలో దేవీపట్నం మండలంలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఆయన యుటిఎఫ్‌లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకుడు పనిచేసి ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఎంతగానో కృషి చేశారు. రస్కిన్ అకాల మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని దేవీపట్నం యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పండా శ్రీనివాసరావు, అరుణ్ కుమార్, చింతూరు యుటిఎఫ్ నాయకులు మీనా కబ్బారావు, పండ కృష్ణయ్య, బోగ్గా ముత్తయ్య, భీమయ్య, కవిత తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి- చింతూరు

రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని పేగ సచివాలయం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. పేగ పంచాయతీ పరిధిలోని రైతుల సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు కుంజ సీతారామయ్య, పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మల్లం సుబ్బమ్మ, సోలం కన్నయ్య తదితరులు పేగ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తమ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ఆశగా ఎదురు చూశామని, కాని ప్రభుత్వం, అధికారులు తమను మోసం చేశారని రైతులను వాపోయారు. దీంతో సిపిఎం ఆధ్వర్యాన పేగ సచివాలయం వద్ద ఆందోళనకు దిగారు. సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన ఆయన రైతుల సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వాగ్దానం మేరకు వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతును రాజుగా తీర్చిదిద్దుతానని ఎన్నికల వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి కనీసం వరి ధాన్యాన్ని కూడా కొనలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయకుంటే చింతూరు ఐటీడీఏ కేంద్రాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పేగ రైతులు కంగాల రంగయ్య, కంగాల చంటి, కంగాల ముఖేష్ ప్రసాద్, మడివి రామయ్య, సోడా సంకూర్, మడకం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


పేగ గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

గిరిజన సంఘం ఆధ్వర్యాన కరపత్రాల పంపిణీ


కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని అరకు సంత బయలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గిరిజన సంఘం నాయకులు సోమవారం కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులు, ఇతర పట్టభద్రులను కలిసి, రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి చట్టసభల్లో ఈ ప్రాంత ప్రజల వాణిని వినిపించాలంటే, సమస్యలపై అవగాహన, పోరాటతత్వం ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ వంటి వారిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావంతులైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లంతా విజ్ఞతతో రమాప్రభకు ఓటేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగులు, మేథావులు, 250కుపైగా ప్రజాసంఘాలు బలపర్చిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాపభను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గిరిజన సంఘం నాయకులు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పలుగ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి, కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

పెందుర్తి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 93, 94 వార్డుల పరిధిలోని పలు సచివాలయాలలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జగన్ మాట్లాడుతూ, శాసనమండలిలో నిరుద్యోగులు గొంతు వినిపించేది పిడిఎఫ్ నాయకులేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ, కొమ్మాది, కార్పెంటర్ కాలనీ, వికలాంగుల కాలనీ, రాజీవ్‌గృహకల్ప, స్వయంకృషినగర్ ప్రాంతాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, మాట్లాడుతూ, మార్చి 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రమాప్రభ అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారని, మహిళా సాధికారత కోసం పోరాడుతున్నారన్నారని, అటువంటి వ్యక్తిని గెలిపించుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు


మధురవాడలో ప్రజాసంఘాల నేతల ప్రచారం

డి.కొండమ్మ, సిహెచ్ శేషు, ఎస్.రామప్పడు. డివైఎఫ్ఐ నాయకులు వై.రాము, కెవిపిఎస్ నాయకులు జికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : రమాప్రభ గెలుపును కోరుతూ సోమవారం శ్రీనగర్, అరుణోదయ కాలనీ, సుందరయ్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనిత, సిఐటియు నాయకులు రాంబాబు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు నాయకులు సోమవారం తగరపువలసలో ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేత రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సోమవారం కొండకర్ల గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో ప్రచారం

కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సోమవారం సాయంత్రం ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె రామ సదాశివరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం సూర్య రామకుమార్, ప్రజానాట్య మండలి జిల్లా ప్రతినిధి ఎస్ కనుమ నాయుడు తదితరులు మండలంలోని హరిపాలెం గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు.


సుందరయ్య కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అనిత,


తగరపువలసలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు


అచ్యుతాపురంలో ప్రజాసంఘాల నేతల ఎన్నికల ప్రచారం

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం : స్పందనలో మన్యంలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన వ్యక్తిగత, సామాజిక సమస్యల అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశపు మందిరంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావులతో కలిపి స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ స్పందనలో 26 దరఖాస్తులు రాగా, మారుమూల గ్రామాల అర్జీదారుల వినతులను అనేక అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి తక్షణ చర్యలకు ఆదేశించి, చర్యానివేదికలను వెల్లడించాలని సూచించారు.

కొయ్యూరు మండలం మఠం భీమవరం సచివాలయ పరిధిలో పోతవరం గ్రామంలో ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములకు సర్వే నిర్వహించి, పట్టాలు మంజూరు చేయాలని పంగి నరసింహారావు. గొల్లూరి విజయ్, పంగి లీలావతి దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలకేంద్రంలో ప్రభుత్వ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని, దానిపై తగు చర్యలు తీసుకోవాలని గంగవరానికి చెందిన కుంజం చిన్నారావు దరఖాస్తు సమర్పించారు. 516ఇ నేషనల్ హైవే నిర్మాణంలో కోల్పోతున్న 99 సెంట్లు భూమికి తమ కుటుంబంలోని ఏడుగురు సభ్యులకు సమానంగా నష్టపరిహారం ఇప్పించాలని రాజవొమ్మంగి మండలం దూసరపాము గ్రామానికి చెందిన కె.రామలక్ష్మి దరఖాస్తు సమర్పించారు, పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన తన 12ఎకరాలకు సరిపడా భూమిని వేరొక చోట ఇప్పించాలని టి. సుబ్బారావు అనే గిరిజనులు దరఖాస్తు సమర్పించారు. విద్యుత్ షాక్‌తో చేయిని కోల్పోయిన తన కుమారుడు టి.భరద్వాజ్‌కు ప్రభుత్వపరంగా ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన తుపాటి నాగలక్ష్మి దరఖాస్తు సమర్పించారు,

స్పందనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎన్ శాస్త్రి, ఇఇలు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాసరావు, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూష, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, డాక్టర్ రాధిక, వెటర్నరీ డాక్టర్ గోపిక, జిసిసి మేనేజర్ యం.నాగరాజారెడ్డి, డిఇఇలు సాయి సతీష్, దుర్గాప్రసాద్, రాజేంద్ర బాబు, పిఎఒ రాంబాబు.ఎ డిఎసిహెచ్ కెవి.చౌదరి, సావిత్రి, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, డివిజినల్ సివిల్ సప్లై అధికారి సి. శ్రీహరి. డిప్యూటీ సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఎం.సావిత్రి. సిడిపిఒ సంధ్యారాణి. ఎస్ఒ కబోది. మత్స్యశాఖ అధికారి రమేష్. ఎఇ ఎంవి.సత్యనారాయణ డిపిఎం అపర్ణ పాల్గొన్నారు,

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -మారేడుమిల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22నఉదయం 11 గంటలకు ఎంపిపి సార్ల లలితకుమారి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విజృంభిస్తున్న లంపి చర్మ వ్యాధి

పశువుల మృత్యువాతతో గిరిజనం ఆందోళన


సీలేరులోలంపి వ్యాధి సోకిన ఆవు దూడ

ప్రజాశక్తి -సీలేరు: ఏజెన్సీలోని పలుగ్రామాల్లో పశువులకు లంపి చర్మవ్యాధి సోకడంతో గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు.జికె. వీధి మండలం సీలేరు, దారకొండల్లో ఇప్పటికే పలు పశువులు ఈ వ్యాధి బారిన పడి మృత్యువాత పడ్డాయని పశువుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంపి చర్మవ్యాధి ప్రబలి మూగజీవాలు మృత్యువాత పడుతున్నా, సంబంధిత పశువైద్యశాఖాపరంగా ఎటువంటి చర్యలు లేకపోవడంతో గిరిజనులు వాపోతున్నారు. రాజస్థాన్, హరియాణా ప్రాంతాల్లో నాలుగు నెలల క్రితం లంపి చర్మవ్యాధితో అనేక పశువులు మరణించాయని వార్తలు తెలుసుకున్న స్థానికులు, ప్రస్తుతం అదే వ్యాధి మన్యంలోనూ ప్రబలి మూగజీవాలను పొట్టన పెట్టుకుంటుండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించాలని, దారకొండ, సీలేరులతోపాటు ఇతర గ్రామాల్లో లంపి వ్యాధి లక్షణాలున్న పశువులకు సరైన వైద్యసేవలు అందించి వాటి ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. అదే సమయంలో ఇతర పశువులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా అవసరమైన వ్యాక్సినేషన్ చేయించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ వ్యాధిపై గిరిజనుల్లో నెలకొన్న అపోహలు, సందేహాలు, ఆందోళనను నివృత్తి చేయడానికి వారికి అవగాహన కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

గృహ సారథులకు శిక్షణ



మాట్లాడుతున్న చొక్కాకుల వెంకటరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యాన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా పాడేరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు పేదప్రజలకు అందేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రై కార్ చైర్మన్ ఎస్.బుల్లిబాబు, ఎంపిపి రత్నకుమారి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు ఎస్.రాంబాబు, మాజీ ఎంపిపి ఎస్వి.రమణమూర్తి, మండల కన్వీనర్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

వారపుసంతను సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

తూకాలు, ధరల్లో మోసాలపై స్వయంగా పరిశీలన
అక్రమాలపై కఠిన చర్యలకు అధికారులకు ఆదేశం
సిపిఎం, గిరిజన సంఘం నేతల ఫిర్యాదుకు స్పందన


సబ్ కలెక్టర్ అభిషేక్‌కు సమస్యలు విన్నవిస్తున్న సిపిఎం నేత పృధ్వీరాజ్

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రమైన పెదబయలులో సోమవారం జరిగే వారపుసంతను జిల్లా సబ్‌కలెక్టర్ అభిషేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌తో కలిసి, సంతలోని అన్ని దుకాణాలు, వాటిల్లో సరుకులు, కొనుగోలు కేంద్రాలు, అక్కడున్న కాటాలను స్వయంగా పరిశీలించారు. వ్యాపారులు తూకాలు వేస్తున్న తీరును, గిరిజన ఉత్తత్తులకు చెల్లించే ధరలు ఇతరత్రా అన్ని విషయాలపై సమగ్ర పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము పృధ్వీరాజ్, ఇతర నేతలు సంతలో జరుగుతున్న మోసాలు, జరుగుతున్న అక్రమాలను సబ్‌కలెక్టర అభిషేక్‌కు వివరించారు. అమాయక గిరిజనులకు అన్యాయం జరగకుండా, అధికారుల పర్యవేక్షణ, నిఘా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వారపుసంతలో తూకాలు, ధరల్లో మోసాలు, గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై సిపిఎం, గిరిజన సంఘం నేతలు ఫిర్యాదుతో స్పందించి, వారపుసంత ఆకస్మిక తనిఖీకి వచ్చిన సబ్ కలెక్టర్ అభిషేక్, రాజ్మా, చిక్కుళ్లు పిప్పళ్లమోరీ, పసుపు తదితర గిరిజన ఉత్తత్తుల తూకాల్లోనూ, గిరిజన రైతులకు ధరలు చెల్లింపులో ఎటువంటి అవకతవకలు మోసాలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఉద్యానవనశాఖాధికారులను ఆదేశించారు. తూనికల్లో తేడాలుంటే తక్షణమే కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాపారులతో మాట్లాడి, గిరిజన ఉత్తత్తుల కొనుగోలు సమయంలో వారికి ఏవిధంగా మోసపుచ్చి, నష్టపరిచినా చట్టపరమైన చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు. అలాగే సంతల్లో గిరిజనులకు అమ్మడానికి నాణ్యమైన వస్తువులను తీసుకురావాలని సూచించారు. స్థానిక వైస్ ఎంపిపి కె.రాజబాబు ఉన్నారు.

వారపుసంతలో సమస్యలు, మోసాలపై వినతి

పెదబయలు : స్థానిక వారపుసంతలో అక్రమాలు, మోసాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము పృధ్వీరాజ్ కోరారు. సోమవారం వారపుసంత ఆకస్మిక తనిఖీకి వచ్చిన సందర్భంగా సబ్‌కలెక్టర్ అభిషేక్‌కు స్వయంగా సంతలో జరిగే మోసాలను చూపించి, వివరించామన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు పండించే వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వారపుసంతల్లో జిసిసి ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, తూకాలు, కొలతలతోపాటు వస్తువుల నాణ్యతలో మోసాలను అరికట్టాలని, సంతలో తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని, మార్కెటింగ్ కమిటీ ద్వారా గోదాములను ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే సమయంలో మైదానప్రాంతం నుంచి వచ్చే వ్యాపారులు, దళారులు గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటుధర దక్కకుండా మోసాలకు పాల్పడుతున్నారని సబ్‌కలెక్టర్‌కు వివరించామన్నారు. పెదబయలు వారపుసంతలో లక్షల్లో క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, కొర్రాపుట్టు, జల్దర్బర్ వంటి ప్రాంతాల నుంచి టన్నుల్లో కూరగాయలు, ఇతర ప్రాంతాల నుంచి పసుపు, పిప్పలమోరీ, చింతపండు, ఇతర అటవీ దినుసులు, గిరిజన ఉత్పత్తులను సంతకు తీసుకొచ్చి గిరిజనం విక్రయించే సమయంలో మోసాలు జరుగుతున్నాయని వివరించారు. దీనిపై అప్పటికప్పుడు విన్నవిద్దామంటే మార్కెటింగ్, జిసిసి అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. వనబసింగి, దొడిపుట్టు.మకవరం పనసపుట్టు పెదగూడ చినసిందిపుట్టు తదితర గిరిజన పంచాయతీల నుంచి వాణిజ్యదినుసులు అధిక మొత్తంలో గిరిజన రైతులు అమ్మకానికి తెస్తున్నా, వారికి గిట్టుబాటు ధర లభించని పరిస్థితి ఉందని సబ్ కలెక్టర్‌కు విన్నవించామన్నారు. సీజన్‌లో గిరిజన ఉత్పత్తుల క్రయవిక్రయాలు భారీ స్థాయిలో జరగనున్న నేపథ్యంలో వారపుసంతలో అధికారులను మోహరించి, ఎటువంటి అక్రమాలు, మోసాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న సిపిఎం నేత పృధ్వీరాజ్

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ దుర్మరణం


బోల్తా పడిన ట్రాక్టర్, ఇన్‌సెట్‌లో మృతుడు నాగేశ్వరరావు

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని చిడుమూరు గ్రామంలో జామాయిల్ లోడ్‌తో తెలంగాణ నుంచి వచ్చిన ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ సున్నం నాగేశ్వరరావు (32) అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం చిడుమూరు దగ్గర జరిగిన ప్రమాదంలో మతి చెందిన డ్రైవర్ స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం బూర్గంపాడు మండలం తాళ్లగుమ్మూరు గ్రామానికి చెందినవాడని ఎఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా విలీన మండలాల్లో జామాయిల్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు తరచూ ప్రమాదానికి గురౌతున్నాయి. ప్రమాదానికి శిక్షణ లేని డ్రైవర్లు, అతివేగంగా నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి -చింతూరు ఘాట్‌రోడ్డులో సోమవారం ఆర్‌టిసి బస్సుకు పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. కాకినాడ డిపోకు చెందిన బస్సు కాకినాడ డిపో నుంచి భద్రాచలం ప్రయాణికులతో వెళ్తుండగా ఒక్కసారిగా బ్రేక్స్ ఫెయిల్ అయ్యాయి. ఘాట్ రోడ్డులో దుర్గమ్మ ఆలయం వద్ద బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. తుప్పలు అడ్డురావడం, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సు నిలిచిపోయింది. లేకుంటే పెను ప్రమాదం, ప్రాణనష్టం జరిగి ఉండేదని పలువురు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్కూటీ బోల్తా : ఒకరికి గాయాలు


గాయపడిన విజయకుమార్

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : పెదబయలు, పన్నేడ బంగారుమెట్ట మధ్యలో సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం పద్మపూజిత ఆటో ఫైనాన్స్‌లో పనిచేస్తున్న నెలపర్తి.విజయ్ కుమార్, వారపు సంతలో ఫైనాన్స్ నగదు లావాదేవీలకు వచ్చి, తిరుగు ప్రయాణంలో తాను నివాసముంటున్న స్కూటీ అదుపు తప్పి, రోడ్డు పక్కన పడడంతో తలకు, కుడి చేతికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు క్షతగాత్రుడిని ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కొరకు పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు విజయకుమార్ స్వస్థలం తునికాగా, ఉద్యోగరీత్యా పాడేరులో నివాసముంటున్నాడు.

నిలిచిన 'నాడు నేడు' పనులు

బిల్లులు చెల్లించక నాలుగు నెలలుగా ఆగిన నిర్మాణాలు
అర్ధాంతర భవనాలతో సరికొత్త అవస్థలు
విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన : పట్టని అధికారులు


అరకొర నిర్మాణంతో నిలిచిపోయిన రాత్రులపుట్టు పాఠశాల భవనం

ప్రజాశక్తి -హుకుంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'నాడు నేడు' పనులకు నిధుల గండం వెంటాడుతోంది. రెండో విడతలో మంజూరైన పలు పాఠశాలల్లోని అభివృద్ధి పనులు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. అర్ధాంతరంగా ఆగిన పనులతో ఉ్రాడ బొడ్డపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరు బయట విద్యాబోధనతో ఒకటో తరగతి విద్యార్థి తూబురు ధన్విత ప్రాణాలను బలిగొనగా, అనేక చోట్ల నానా అవస్థలు పడుతున్నారు. నిధుల కొరతతో బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

2020-21లోనాడు నేడు పథకంలో మొదటివిడతగా మంజూరైన నిధులతో మండలంలో 27పాఠశాలలు సుందరంగా అభివృద్ధి చేశారు. రెండో విడతలో 50 పాఠశాలలను గుర్తించగా, ఆయా పాఠశాలల్లో మంజూరైన నిధులతో మొదట్లో చురుగ్గానే పనులు సాగినప్పటికీ, నాలుగు నెలలుగా హఠాత్తుగా నిలిచిపోయాయి. దీంతో అర్ధాంతరంగా నిలిచిన పనులు ఇపుడు కొత్త సమస్యలు సృష్టిస్తున్నాయి.

పాఠశాలల్లో పనులు జరుగుతుండడంతో ప్రత్యామ్నాయంగా ఆరుబయటో, ఇంకొకచోట పాఠశాలలను నిర్వహించాల్సిన దుస్థితిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే క్రమంలో నాడునేడు పనులు జరుగుతున్న ఉ్రాడ బొడ్డపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరు బయట తరగతులు నిర్వహిస్తుండగా, విద్యుత్‌స్తంభం పడడంతో తూబురు ధన్విత అనే ఒకటో తరగతి విద్యార్థిని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కరకపుట్టు ఎంపిపి పాఠశాల పనులు సగంలోనే నిలిచిపోవడంతో చర్చిలోకి పాఠశాలను మార్చాల్సిన దుస్థితి దాపురించించి. మిగిలిన పాఠశాలల్లో దాదాపు ఇలాంటి సమస్యలతోనే ఇబ్బందులు పడుతున్నారు.

నాడునేడు పనులతో పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ఆశించిన తల్లిదండ్రులు, ఇపుడు సగంలోనే నిలిచిన పనులతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇతర అధికారులను ప్రశ్నిస్తే, నిధులు విడుదల కాక బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో పనులు నిలిచిపోయాయని చెప్పడంతో ఆందోళన వ్యక్తమౌతోంది. పాత భవనాలు లేక, కొత్త భవనాలు పూర్తికాక ఎటూ కొరగాని విధంగా నాడునేడు పనులు ఉన్న వసతిని లేకుండా చేసేశాయని పలువురు ఆరోపిస్తున్నారు. అనేక పాఠశాలలకు కిటికీలు తలుపులు లేకుండా సగంలోనే ఉండిపోగా, కొన్ని పాఠశాలకు మరమ్మతుల కోసం శ్లాబులు, గోడల పెచ్చులను ఊడగొట్టి, వాటికి ప్లాస్టింగ్‌లు చేయకుండా వదిలేశారు. శ్లాబు, లింటల్ లెవెల్ వరకు కొన్ని చోట్ల పనులు జరిగాయి, దాదాపు అన్ని పాఠశాలల్లోనూ అరకొర పనులతో కొత్త సమస్యలు సృష్టించిన ప్రభుత్వం, వెంటనే నిధులను మంజూరు చేసి పాఠశాలల్లో నాడునేడు పనులను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు కోరుతున్నారు.


విద్యార్థిని ప్రాణాలను బలిగొన్న ఉర్రాడ బొడ్డుపుట్టు పాఠశాల


చర్చిలో నిర్వహిస్తున్న కరకపుట్టు పాఠశాల